
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.0 కనిష్ఠం 9.5
ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
శుక్రవారం 26 జనవరి 2024



రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

నేరడిగొండ, జనవరి 25: ప్రతీఒక్కరు రోడ్డుభద్రత నియమాలు పాటించి సురక్షితంగా గమ్యం చేరాలని ప్రాజెక్టు మేనేజర్ సూర్యనారాయణ అన్నారు. గురువారం రోడ్డు భద్రత వారోత్సవంలో భాగంగా 11వ రోజు నేరడిగొండ పార్కింగ్ వద్ద వాహనదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ సూర్యనారాయణ, ప్రాజెక్టు ఇన్‌చార్జీ రామ్‌మోహన్‌రెడ్డి, పూసపత్రివినేష్, పెట్రోలింగ్ సిబ్బంది శివరాజ్, బాలకృష్ణ, భూమన్న పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముస్తాబైన పరేడ్ గ్రౌండ్



పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 25: గణతంత్ర వేడుకలకు జిల్లాకేంద్రంలోని పరేడ్ మైదానం ముస్తాబైంది. వేడుకలను అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా గణతంత్ర వేడుకలకు ఘనంగా నిర్వహించుకోనున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేయనుండగా జిల్లాకేంద్రంలోని పరేడ్ మైదానంలో ఈవేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లుచేసింది. రంగురంగుల ముగ్గులతో మైదానాన్ని సిద్ధం చేయగా త్రివర్ణ పతాకన్ని ఆవిష్కరించేందుకు జెండాను అధికారులు ముస్తాబుచేశారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంతోపాటు పరేడ్ మైదానంలో నిర్వహించనున్న వేడుకల్లో కలెక్టర్ రాహుల్‌రాజ్ పీఎస్, ఎస్పీ గౌస్ ఆలాంలతోపాటు అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. పోలీసు పరేడ్‌గ్రౌండ్‌లో ఏర్పాట్లను ఎస్పీ గౌస్‌ఆలంతో కలిసి కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ పరిశీలించారు.







- తాజాగా కోహెడా మార్కెట్‌కు రూ.9కోట్ల నిధుల బదిలీ
- గత ప్రభుత్వ హయాంలోనే రూ.10.75 కోట్ల తరలింపు
- ఏళ్ల తరబడి నిలిచిన వాయిదాల చెల్లింపులు
- నోటీసులతోనే సరిపెడుతున్న అధికారులు
- కలగానే మారిన మోడల్ మార్కెట్ యార్డ్ నిర్మాణం
- నోరు మెదపని జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు

మార్కెట్ నిధులు తరలి పోతున్నాయ్!



ఆదిలాబాద్, జనవరి25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రధాన మార్కెట్లలో ఒక్కటైనా ఆదిలాబాద్ మార్కెట్ నిధులు ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నాయి. ప్రభుత్వం, పాలకులు మారిన నిధుల తరలింపు మాత్రం ఆగడం లేదు. గత ప్రభుత్వ హయాంలో రూ.10.75 కోట్లను ఇతర ప్రాంతాల మార్కెట్లకు తరలించుకుపోయారు. తాజాగా హైదరాబాద్‌లోని కోహెడా మార్కెట్‌కు రూ.9కోట్ల నిధులను బదిలీ చేయడం పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో ప్రధానంగా పండించే పత్తి, సోయా, కంది, శనగ ఇతర పంట ఉత్పత్తుల ద్వారా ఏటా ఆదిలాబాద్ మార్కెట్ కమిటీకి రూ.7 నుంచి రూ.8కోట్ల ఆదాయం సమకూరుతోంది. ఈ నిధులతో మార్కెట్ ఆధునికరణ పనులు రైతులకు అవసరమైన వసతులను కల్పించాల్సి ఉండగా అధికారులు అవేమీ పట్టించుకోవడంలేదు. రైతు సంఘాలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు కూడా చూసీ చూడనట్లుగానే వ్యవహరించడంతో ఏటా కోట్ల రూపాయల నిధులు ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నాయి. ప్రభుత్వ ఆదేశాలతో ఇతర మార్కెట్‌లకు నిధులను కేటాయిస్తున్న తిరిగి నయా పైసా కూడా రాకపోవడంతో మార్కెట్ అధికారులు తంటాలు పడుతున్నారు. బకాయి చెల్లింపులపై నోటీసులిస్తున్న సరైనా స్పందనే కనిపించడం లేదు. దీంతో నిధులు ఇవ్వడమే తప్ప తిరిగి రాబట్టుకునేందుకు అధికారులు ప్రయత్నం చేయడం లేదంటున్నారు. ఇంత జరుగుతున్నా జిల్లా పాలకులు, ప్రజా ప్రతినిధులు నోరు మెదుపడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

12ఏళ్లుగా నిలిచిపోయిన వసూళ్లు

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే మార్కెట్ నిధులను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నామని అధికారులు చెప్తున్నా తిరిగి వసూళ్ల చేయకపోవడంతో అధికారుల నిండు నిర్లక్ష్యమే కన్పిస్తోంది. గడిచిన 12ఏళ్లుగా నయా పైసా కూడా వసూలు కావడంలేదు. నోటీసులు ఇవ్వడంతోనే సరిపెడుతున్నారు. అసలు నిబంధనల ప్రకారం ప్రతీ మూడు మాసాలకోసారి వడ్డీతో సహా అసలు వాయిదాలను తిరిగిచెల్లించాల్సి ఉంటుంది. కానీ ఏ ఒక్క మార్కెట్ కమిటీ ఇలాంటి నిబంధనలను పాటించడమే లేదు. 2012లో మహబూబ్ నగర్ జిల్లా బాదేపల్లి మార్కెట్ కమిటీకి రూ.కోటి నిధులను కేటాయించారు. కానీ ఇప్పటివరకు ఒక్క వాయిదాను కూడా చెల్లించనే లేదు. 2014లో సంగారెడ్డి జిల్లా వట్‌పల్లికి రూ.1.50కోట్లు, 2018లో సిద్దిపేట మార్కెట్ కమిటీకి రూ.3కోట్లు, గజ్వేల్ మార్కెట్ కమిటీకి రూ.కోటి, రంగారెడ్డి జిల్లా తాండూరు మార్కెట్ కమిటీకి రూ.1.25 కోట్లు, వనపర్తి మార్కెట్ కమిటికి రూ. 3 కోట్లను కేటాయించిన ఇప్పటి వరకు తిరిగి చెల్లించనే లేదు. అయిన తాజాగా కోహెడా మార్కెట్ కమిటీకి రూ.9కోట్లు నిధులు చెల్లించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాజుల పైసా రాళ్లపాలు అన్నట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఒప్పందం ప్రకారం నడుచుకోని మార్కెట్ కమిటీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలోనూ పాలకవర్గాలు వెనుకడుగు వేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆకలితో అలమటిస్తున్న అన్నదాతలు

ఆదిలాబాద్ మార్కెట్ కమిటీకి యేటా కోట్ల రూపాయల ఆదాయం ఉన్న అన్నదాతలు ఆకలితో అలమటించే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రభుత్వం బోజన వసతిని కల్పించేందుకు కూడా కనీస చర్యలు తీసుకోవడం లేదు. గతంలో దాతల సహకారంతో సద్దిమూట కార్యక్రమాన్ని అమలు చేసిన అది మూన్నాళ్ల ముచ్చటగానే మారింది. గత రెండు మూడేళ్లుగా సద్దిమూట కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేయడం లేదు. అలాగే పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు అవసరమైన గోదాములు అందుబాటులో లేవు. పశువుల సంతలోనూ అరకొర వసతులే కన్పిస్తున్నాయి. ఈ మార్కెట్‌లోనే ఎన్నో సమస్యలు ఉన్నా నిధులు మాత్రం తరలిపోతూనే ఉన్నాయి. 2014లో మావల మండలంలోని బట్టిసావర్గాం గ్రామ సమీపంలో మోడల్ మార్కెట్ యార్డ్ నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అప్పట్లోనే మార్కెట్ యార్డ్ నిర్మాణానికి 100 ఎకరాల స్థల సేకరణ కూడా చేశారు. కానీ ఇప్పటివరకు ఆచరణ సాధ్యం కాకపోవడంతో ప్రతిపాదనలకే పరిమితమైంది. కోట్ల రూపాయల ఆదాయం ఉన్న ఇతర జిల్లాలకు నిధులను అప్పగించడంతో జిల్లాలో అభివృద్ధి లేకుండానే పోయింది. ప్రస్తుతం ఉన్న ఆదిలాబాద్ మార్కెట్ యార్డ్‌కు పంట ఉత్పత్తులను తరలించేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సీజన్‌లో మార్కెట్ యార్డ్ నుంచి కిలోమీటర్ల మేర వాహనాలు రోడ్డుపైననే నిలిచి పోతున్నాయి. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. అందుబాటులో ఉన్న నిధులతో మోడల్ మార్కెట్ యార్డ్ నిర్మాణం చేపడితే ఇబ్బందులు తప్పనున్నాయి. హోల్‌సేల్ మార్కెట్ నిర్మాణంతో పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులతోపాటు వినియోగదారులకు నిత్యవసరాల ధరలు అందుబాటులోకి రానున్నాయి. మార్కెట్ అభివృద్ధిపై దృష్టి సారించకుండా ఉన్న నిధులను ఇతర ప్రాంతాలకు అప్పగించడంపై అన్నదాతలు మండిపడుతున్నారు.

ప్రభుత్వ ఆదేశాలతోనే..

మధుకర్ (మార్కెట్ కమిటీ సెక్రటరీ, ఆదిలాబాద్)

ప్రభుత్వ ఆదేశాలతోనే కోహెడా మార్కెట్ కమిటీకి రూ.9 కోట్ల నిధులను బదిలీ అయ్యాయి. తిరిగి చెల్లించేలా ఒప్పందం చేసుకున్నాం. రికవరీపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. మోడల్ మార్కెట్ యార్డు నిర్మాణానికి సంబంధించిన స్థలం కేటాయింపు జరుగలేదు. ప్రభుత్వం మంజూరు చేస్తే నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం. పట్టణం నడిబొడ్డున కాకుండా పరిసర ప్రాంతాల్లో మార్కెట్ యార్డు నిర్మిస్తేనే రైతులకు ఇబ్బందులు దూరమవుతాయి.

నిధుల తరలింపును సీరియస్‌గా తీసుకుంటాం

పాయల శంకర్ (ఎమ్మెల్యే, ఆదిలా బాద్)

ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ నుంచి ఇతర మార్కెట్‌లకు నిధుల తరలింపు విషయాన్ని సీరియస్‌గా తీసుకుంటాం. ఇక్కడి రైతుల పంట ఉత్పత్తులపై వస్తున్న ఆదాయాన్ని ఇక్కడి రైతుల సంక్షేమానికే ఖర్చుచేయాలి. గత ప్రభుత్వం లాగే కాంగ్రెస్ వ్యవహరిస్తోంది. నిధులు ఇవ్వడమే తప్ప రికవరీ చేయడంలోనూ నిర్లక్ష్యం కన్పిస్తోంది. మోడల్ మార్కెట్‌యార్డు నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం. అవసరమైతే సీఎంని కలిసి ఇక్కడి రైతుల ఇబ్బందులను వివరిస్తా.

సంక్షిప్త సమాచారం

28 వరకు పత్తి కొనుగోళ్ల నిలిపివేత

బోథ్, జనవరి25: బోథ్‌మార్కెట్ కమిటీ పరిధిలోని జిన్నింగులలో ఈనెల 28 వరకు పత్తి కొనుగోలు నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి దేవన్న, సూపర్‌వైజర్ స్వామి తెలిపారు. తిరిగి 29న పత్తి కొనుగోలు సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోలు జరుగుతాయన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించి మార్కెట్లోకి పత్తిని తీసుకురావాలని కోరారు.

జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లో మండల విద్యార్థి ఉత్తమ ప్రతిభ

బోథ్, జనవరి 25: జిల్లాస్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శనలు బోథ్ మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన 10వ తరగతి విద్యార్థి అభినయ్ ప్రతిభ కనబరిచారు. ఇంట్లో వాష్ బేసిన్‌లో వినియోగించిన నీరు వృధాపోకుండా, టాయిలెట్ పరిశుభ్రతకు ఎలా వినియోగించుకోవాలని అనే అంశంపై ప్రదర్శనిచ్చాడు. ఇందుకుగానూ విద్యార్థి జిల్లాస్థాయిలో రెండో బహుమతికి ఎంపికయ్యాడు. అదనపు కలెక్టర్ జిల్లా విద్యాశాఖ అధికారి ఆదిలాబాద్ ఎమ్మెల్యే చేతుల మీదుగా అవార్డు అందుకున్నాడు. విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు గ్రామస్థులు అభినందించారు.

యువకుడి ఆత్మహత్య

ఉట్నూర్, జనవరి 25: మండలంలోని లక్కారం పంచాయతీ పరిధిలోని నవోదయ నగర్‌కు చెందిన అమర్ (34) గంగన్నపేట చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు గురువారం తెలిపారు. కొన్ని రోజులుగా కరీంనగర్‌లో ఉంటూ ఇటీవల ఇంటికి వచ్చిన అమీర్ ప్రతీరోజు తాగి ఇంటికి వస్తున్నడంతో భార్య మందలించింది. అమర్ బుధవారం రాత్రి ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. చెరువులో మృతదేహం లభ్యమైనట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు శవాన్ని పోస్టుమార్గానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మనోహర్ తెలిపారు.

విద్యార్థులతో మోదీ వర్చువల్



వర్చువల్‌లో పాల్గొన్న విద్యార్థులు



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రధాని నరేంద్రమోదీ

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 25: ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టిన తర్వాత దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని ఎమ్మెల్యే పాయలశంకర్ అన్నారు. నమో నవదాత సమ్మేళనంలో భాగంగా ప్రధాని కొత్త ఓటర్లుగా నమోదు చేసుకున్న విద్యార్థులతో వర్చ్యువల్ విధానంలో మాట్లాడారు. గురువారం బీజేవైఎం ఆధ్వర్యంలో విద్యార్థి కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమాన్ని విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే లైవ్‌లో వీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతీఒక్కరు ఓటరుగా నమోదు చేసుకుని మంచిచేసే వారికి మద్దతివ్వాలన్నారు. యువతతోనే దేశంలో మార్పు వస్తుందని, మీ ద్వారా బీజేపీకి మరింత శక్తి కావాలని, దేశం కోసం తపనపడే ప్రధానికి మద్దతివ్వాలని కోరారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు బ్రహ్మానంద్, రాళ్లబండి మహేందర్, శివగౌడ్, సురేందర్, నిఖిల్, శేఖర్, అజయ్, బీజేపీ నాయకులు లాలామున్న, జోగురవి, ఆకుల ప్రవీణ్, వేదవ్యాస్, తదితరున్నారు.

ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

- బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే


బోథ్, జనవరి 25: ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. గురువారం మండలకేంద్రంలో కందులు కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు చేసిన పంటకు సకాలంలో డబ్బులు అందేలా చూడాలని కోరారు. సమావేశంలో పాల్గొన్న సహకార సంఘం డైరెక్టర్ జి.రాజు యాదవ్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఉద్దేశంతో కేంద్రప్రభుత్వం పంట కొనుగోలును చేస్తుందన్నారు. గతంలో లేనివిధంగా ప్రధానమంత్రి పప్పు ధాన్యాలకు ప్రైవేట్ వ్యాపారులతో పోటీపడి కొనుగోలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సమావేశంలో మార్కెటింగ్‌శాఖ జిల్లాఅధికారి ప్రవీణ్‌రెడ్డి, బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మాన్సింగ్, జడ్పీటీసీ నేరేడిగొండ ఎంపీపీ సజన్లాల్, సహకార సంఘం చైర్మన్ కదం ప్రశాంత్, ఆత్మ చైర్మన్ మల్లెపూల సుభాష్, తదితరులు పాల్గొన్నారు.


అటవీశాఖ ఉత్తమ అధికారులుగా ఇద్దరి ఎంపిక

బోథ్, జనవరి25: బోథ్ రేంజ్ పరిధిలోని సెక్షన్ అధికారి సుందర్‌తోపాటు మరలపెల్లి బీట్ ఆఫీసర్ ధనరాజ్ సెక్షన్ అధికారి ఉత్తమ అటవీశాఖ అధికారులు ఎంపికైనట్లు రేంజ్ అధికారి ప్రణయ్ తెలిపారు. రూ.3లక్షలకు పైగా సీఫీజు వసూలు చేయడంలో సెక్షన్ అధికారి ఉత్తమ అధికారిగా ప్రభుత్వం గుర్తించిందన్నారు. మరలపెల్లి బీట్ ఆఫీసర్ ధనరాజ్ అడవుల్లో మంటలను అదుపుచేయడంలో కృషి చేసిన ఈయనకు ప్రభుత్వం ఉత్తమ అధికారిగా గుర్తించినట్లు చెప్పారు. గణతంత్ర వేడుకల రోజున అధికారులకు నగదు తోపాటు అవార్డును అందుకోనున్నారు.









ఆదివాసీల ఖాందేవ్ జాతర ప్రారంభం



పూజల కోసం ఆలయానికి చేరుకుంటున్న గిరిజనులు

ఉట్నూర్, జనవరి 25: ఉట్నూర్ ఏజెన్సీలోని ఆదివాసీ గిరి జనుల సాంప్రదాయం, ఆచారాలతో ముడిపడి ఉన్న తొడసం వంశీయులకు చెందిన నార్నూర్ మండల కేంద్ర ంలో ఖామ్‌దేవ్ జాతర గురువారం ప్రారంభమైంది. పక్షం రోజులపాటు జరుగనున్న ఈజాతరకు తొడసం వంశానికి చెందిన ఆదివాసీ గిరిజనులు ఎక్కడ ఉన్న జాతరకు వచ్చి ఖాందేవ్‌ను దర్శించుకోవడానికి చేరుకుంటారు. ప్రతీయేటా పుష్యమి పౌర్ణమి రాత్రి పూజచేసి తొడసంగిరిజనులు పూజలు నిర్వహించారు. ఈ జాతరలో రెండోరోజు తొడసం వంశీయుల ఆడపడుచు 26న నాటు నువ్వులనూనె తాగడం సాంప్రదాయంగా వస్తోంది.

జాతరలో వెలుస్తున్న దుకాణాలు

నార్నూర్ మండలకేంద్రంలో ప్రారంభమైన ఖాందేవ్ జాతరలో వ్యాపారాలు దుకాణాలను ఏర్పాటు చేసుకుంటు న్నారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా సమీపంలో ఉన్న మహారాష్ట్ర నుంచి తరలివస్తున్న వ్యాపారులుస్టీల్, ఇత్తడి, అల్యూమినియం, లేడీస్ ఎంపో రియంలు, బొమ్మల దుకాణాలు, హోటళ్లు, రంగులరట్నాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇదేకాకుండా నార్నూర్ మండలా నికి చెందిన పూర్వ విద్యార్థులు ఎక్కడున్నా ఉద్యోగాలు చేస్తున్నవారు కూడా జాతరలో నిర్వహించే క్రికెట్, వాలీబాల్, కబడ్డీ లాంటి పోటీలకు తరలివచ్చి బంధువులు, స్నేహితులను కలుసుకుంటారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 25: మహాలక్ష్మివాడకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త దిల్షత్ తండ్రి పాషా అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషయం మాజీ మంత్రి జోగురామన్న దృష్టికి చేరడంతో కార్యకర్త కుటుంబాన్ని గురువారం పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని సంతాపాన్ని ప్రకటించారు. ఇందులో కౌన్సిలర్ పందిరి భూమన్న, నాయకులు సాజిదుద్దీన్, నారాయణ ఉన్నారు.

ఎంపీపీని కలిసిన పంచాయతీ కార్యదర్శులు

ఉట్నూర్, జనవరి25: మండలంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించడం ఆనందంగా ఉందని ఎంపీపీ జైవంత్‌రావు అన్నారు. గురువారం క్రమబద్ధీకరణ ఉత్తర్వులు అందుకున్న సందర్భంగా కార్యదర్శులు ఎంపీపీని కలిసి పుష్పగుచ్ఛం అందించారు.



ఆదిలాబాద్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ప్రొటోకాల్‌కు విరుద్ధంగా చెక్కుల పంపిణీ

● ఆదిలాబాద్ ఎమ్మెల్యేపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఆదిలాబాద్‌అర్బన్, జనవరి25: ఈనెల 24న ఆదిలాబాద్ నియోజకవర్గంలోని మావల, బేల, పట్టణానికి సంబంధించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పాయలశంకర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రొటోకాల్‌కు విరుద్ధంగా లబ్ధిదారులకు అందజేశారని సర్పంచులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు ఫిర్యాదు చేశారు. కనీసం స్థానిక ప్రజాప్రతినిధులమైన తమకు అధికారులు సమాచారం ఇవ్వలేదన్నారు. ఈ విషయంపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందులో బేల జడ్పీటీసీ అక్షిత పవార్, మావల జడ్పీటీసీ నల్ల వనిత, బేల ఎంపీపీ టాక్రె వనిత, మావల ఎంపీపీ దర్శనాల సంగీత, జైనథ్ జడ్పీటీసీ తుమ్మల అరుంధతి ఉన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

● రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు

భీంపూర్, జనవరి 25: రైతు కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆత్మహత్యల నివారణ కమిటీ, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగేపు బొర్రన్న అన్నారు. ఆయన గురువారం భీంపూర్ మండలం పిప్పల్ కోటి గ్రామానికి చెందిన ఎడపెల్లి రమేష్ అనే కౌలు రైతు ఇటీవలే ఆత్మహత్య చేసుకోగా మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం ప్రకటించిన 194 జీవో ప్రకాష్ మృతుడి కుటుంబానికి రూ.6లక్షల పరిహారాన్ని ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కుటుంబ పెద్దకు ప్రతీనెల రూ.5వేల పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఆయనతో సర్పంచ్ కెమా గంగయ్య, రైతులు, పెంట రాజారెడ్డి, గంగన్న, ఓం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పిప్పల్‌కోటిలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న దృశ్యం



పంజాబ్ చౌక్‌లోని డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే

ఆదిలాబాద్ అర్బన్, జనవరి25: పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయలశంకర్ తెలిపారు. గురువారం స్థానిక కిసాన్‌చౌక్‌లో వ్యాపారస్థులు, ప్రజలు ట్రాఫిక్‌తో పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కిసాన్‌చౌక్ పరిసరాలను మున్సిపల్, ఆర్అండ్‌బీ, ట్రాఫిక్ అధికారులతో కలిసి పరిశీలించారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఆర్‌వోబీ పనులను అనంతరం రోడ్డును వేడల్పు, ట్రాఫిక్‌సిగ్నల్స్ ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తోడ్పాడుతుందని తెలిపారు. అలాగే మున్సిపల్, మార్కెట్, ఆర్అండ్‌బీ శాఖలతో త్వరలో సమావేశం నిర్వహించి ట్రాఫిక్ సమస్యను నియంత్రించడానికి కృషిచేస్తామని పేర్కొన్నారు.

● క్రిటికల్ కేర్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ

కేంద్రప్రభుత్వం పేదలకు నాణ్యమైన వైద్యం అందించడానికి కావాల్సిన భవనాలు, పరికరాలను అందిస్తోందని, రాష్ట్రప్రభుత్వం కూడా దానికి అనుగుణంగా వైద్యులను నియమించాలని ఎమ్మెల్యే పాయలశంకర్ కోరారు. కేంద్రప్రభుత్వం ఎన్‌హెచ్ఎం పథకంలో భాగంగా రూ.23.75కోట్లతో మంజూరుచేసిన క్రిటికల్‌కేర్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే గురువారం భూమిపూజచేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జిల్లాలో ఆరోగ్యసేవలు మరింత విస్తృతపరచడానికి అవసరమైన ఆసుపత్రులు, భవనాలు నిర్మిస్తుందన్నారు. జిల్లాలో నెలకొన్న సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి, వైద్యఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహా, జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్కతో విన్నవించినట్లు చెప్పారు. కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, సూపరింటెండెంట్ అశక్క్, సీనియర్ వైద్యులు తిప్పస్వామి, ఇంజనీరింగ్ ఈఈ నరసింహారావు, బీజేపీ లాలామున్న, జోగురవి, శ్రీనివాస్, ముకుంద్, నగేష్‌రెడ్డి, వేణు, రాజు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడలో కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఇచ్చోడ, జనవరి 25: ఇచ్చోడ మార్కెట్ యార్డులో కందుల కొనుగోలు కేంద్రాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ స్థానిక నాయకులతో కలిసి గురువారం ప్రారంభించారు. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో సర్పంచి సునీత, ఉపసర్పంచి శిరీష్‌రెడ్డి, ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, మండల కన్వీనర్ ఎనుగుకృష్ణారెడ్డి, ఎంపీటీసీ నిమ్మల శివారెడ్డి, నాయకులు పాండురంగ్, షాబీర్, రవి పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌లో ఓటు హక్కు ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



ఆదిలాబాద్‌లో బైక్ ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, జిల్లా ఎస్పీ

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

● 18 ఏళ్లు నిండిన ప్రతీఒక్కరు ఓటు హక్కు పొందాలి: ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ ● జిల్లావ్యాప్తంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

ఆదిలాబాద్‌అర్బన్, జనవరి25: ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వజ్రాయుధం లాంటిదని కలెక్టర్ రాహుల్‌రాజ్ పీఎస్ అన్నారు. 14వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎస్పీ గౌస్‌ఆలంతో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ఓటర్ల దినోత్సవం సందర్భంగా తీసుకొస్తున్న మార్పులు, సంస్కరణలు, ఓటుహక్కు, దాని ప్రాధాన్యత అంశాలపై వివిధరకాల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా రంగోలి పోటీలు, నూతన ఓటర్లకు గుర్తింపు కార్డుల పంపిణీ, సీనియర్ సిటిజన్లకు సన్మానం, పాఠశాలలు కళాశాలస్థాయిలోని పిల్లలకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు కార్యక్రమాలను నిర్వహించి అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వృద్ధులకు, దివ్యాంగ ఓటర్లకు ఇంటి దగ్గరికి వెళ్లి ఓటువేసేలా అవకాశం కల్పించామన్నారు. అనంతరం ఓటుహక్కుపై కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాజాత, విద్యార్థులు ఓటు ప్రాధాన్యతపై అవగాహన ప్రదర్శనలు ఆహ్వానితులను అలరించాయి. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్లను శాలువాతో సన్మానించారు. ఓటరు అవగాహన పై నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేశారు. అంతకుముందు స్థానిక ఇందిరా ప్రియదర్శిని క్రీడామైదానంలో ఓటు హక్కు వినియోగం, నమోదుపై నిర్వహించిన బైక్ ర్యాలీని అదనపు కలెక్టర్ శ్యామలదేవి జెండా ఊపి ప్రారంభించారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి కలెక్టర్‌చౌక్, తెలంగాణ చౌక్, వినాయక్‌చౌక్, నేతాజిచౌక్, పంజాబ్‌చౌక్ మీదుగా జడ్పీ కార్యాలయ సమావేశ మందిరం వరకు సాగిన బైక్ ర్యాలీలో కలెక్టర్, ఎస్పీ, అటవీ, పోలీసు అధికారులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, యువత పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా అటవి అధికారి ప్రశాంత్‌జీవన్‌పాటిల్, డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, డీపీఆర్‌వో ఇ.విష్ణువర్ధన్, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలందప్రియా, జిల్ల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉట్నూర్: ఓటు హక్కును అందజుఞ వినియోగించుకోవాలని ఉట్నూర్ ఆర్డీవో జీవాకర్‌రెడ్డి అన్నారు. గురువారం ఉట్నూర్ మండలకేంద్రంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ వెద్మభుజంగరావు, ఎస్సై మనోహార్, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: మండలకేంద్రంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతీఒక్కరు ఓటునమోదు చేయనుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ నాగోరావ్, ప్రధానోపాధ్యాయులు పద్మా, పంచాయతీ కార్యదర్శి రాఘవ, సర్పంచ్ పీవీ రమణ, పెద్దులు, షకీల్, రాజరామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో..

బజార్‌హత్నూర్: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సునిల్‌కుమార్ ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి జ్ఞానేశ్వర్ షిండే విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు గంగాధర్, బీమేష్, నవీన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, శ్రీనివాస్, వనజా, ప్రదీప్, సుభాస్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

జైనథ్: జైనథ్‌లోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జైనథ్ బస్టాండ్ ఆవరణలో మానవహారంగా ఏర్పడి తహసీల్దార్ కె.శ్యామ్‌సుందర్ ఓటుహక్కు ప్రతిజ్ఞను చేయించారు. కార్యక్రమంలో జైనథ్ మండల డిప్యూటీ తహసీల్దార్ రాథోడ్‌రాజేశ్వరి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లు నితిన్, విజయ్,హెచ్ఎం లస్మన్న, జూనియర్ అసిస్టెంట్ ప్రకాష్ తదితరులున్నారు.

సిరికొండ: మండలకేంద్రంలో ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి గ్రామంలోని పలు వీధుల గుండా తిరుగుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఓటుహక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీటీ ఉపేందర్, సర్పంచ్ ఒరగంటి నర్మదా పెంటన్న, ఉపాధ్యాయులు కాంతయ్య, సునీల్, అంగన్వాడీ టీచర్లు రాణి, మౌనజ, రెవెన్యూ సిబ్బంది, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

● సమర్థవంతమైన పాలకులను ఎన్నుకునే ఆయుధం ఓటు

బోథ్: ప్రజాస్వామ్యంలో సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకునేందుకు ఓటు ఆయుధమని బోథ్ తహసీల్దార్ సుభాష్ చంద్ర పేర్కొన్నారు. మండలకేంద్రంలో విద్యార్థులతో కలిసి అధికారులు ఓటుపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటు హక్కు చాలా బలమైందని, ఓటును ప్రలోభాలకు లొంగకుండా వినియోగించుకోవాలని అన్నారు. అనంతరం బోథ్ బస్టాండ్‌లో విద్యార్థుల చేత తహసీల్దార్ ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సోషల్ రెడ్డి, ఎస్ఐ బి.రాము, డిప్యూటీ తహసిల్దార్ భూమేష్, సీనియర్ అసిస్టెంట్ ఆర్ఐ సునీత, ఎలక్షన్ డిటి వామన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: 18 ఏళ్లు నిండిన ప్రతీఒక్కరు ఓటరుగా నమోదు చేయించుకోవాలని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి రవీందర్ పేర్కొన్నారు. గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో జాతీయసేవా పథకం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రానున్న ఇంటర్మీడియట్ పరీక్షలలో విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని కోరారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఇ.రాజశేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ప్రవీణ్‌రెడ్డి, కార్తీక్, దీప, ముత్యం, సతీష్, నరేష్, నవీన్, ప్రసాద్, రాజేశ్వరస్వామి, మహేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.



బోథ్‌లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

భీంపూర్: మండలంలోని పిప్పల్ కోటి ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు మానవహారం చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం శ్యామ్‌సుందర్‌రావ్ మాట్లాడుతూ.. 18ఏళ్లు నిండిన ప్రతీఒక్కరూ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నగేష్ కుమార్, సిపిఎం మండల కార్యదర్శి స్వామి, అంగన్‌వాడి టీచర్ వెంకటమ్మ పాల్గొన్నారు.

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి అధికారులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద విద్యార్థులు, అధికారులు ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ కవితారెడ్డి మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆర్. భాగ్యలక్ష్మి, సర్పంచ్ జాదవ్‌సునీత, ఆర్ఐ అరుణ్, ఎంపీవో లింగయ్య, ఎంఈఓ నారాయణ, హెచ్ఎం దేవిదాస్, పాల్గొన్నారు.

ఉట్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగాజాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ నిర్వహించి ప్రిన్సిపాల్ పావనికుమారి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ ఎంపీడీవో ఆఫీస్ ఐటీడీఏ టు ఉట్నూర్ ఐబీచౌరస్తా వరకు ఆర్డీవో, ఎంపీడీవోల ఆధ్వర్యంలో సాగింది. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసరావు సువర్ణ, వినోద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ లక్ష్మణ్ తిరుపతి, సుజాత, నవీన్, దశరథ్, కిషోర్, రూప, అధ్యాపకేతరులు ప్రకాష్, సాయి, కృష్ణ, అజీజ్‌ఖాన్, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుతూ చదువులో రాణించాలి

● 'పోలీసులు మీకోసం'లో ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం ● 300 మంది కొలాం గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

ఇంద్రవెల్లి, జనవరి 25: కొలాం గిరిజనులు తమ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతూ చదువులో రాణించాలని ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా మండలంలోని సమాక గ్రామ పంచాయతీ పరిధిలోని పాటగూడ గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో గురువారం దుప్పట్ల పంపిణీ కార్యక్రమానికి అతిథిగా హాజరయ్యారు. గ్రామంతో పాటు అనుబంధ గ్రామాలకు చెందిన 300మందికి దుప్పట్లను పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ కొలాం గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కొలాం గిరిజన గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం యువకులకు వాలీబాల్ కిట్‌లు, కొలాం కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. స్థానిక గిరిజనులతో కలిసి ఎస్పీ సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, సీఐ రామకృష్ణ, ఎస్సై దుబ్బాక సునీల్, గ్రామ పటేల్ కొడప లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలికి దుప్పటిని అందజేస్తున్న ఎస్పీ

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు: ఎస్పీ

ఇంద్రవెల్లి: సీఎం రేవంత్‌రెడ్డి ఈనెల 27, 28, 29వ తేదీల్లో ఇంద్రవెల్లి పర్యటనకు వచ్చే అవకాశం ఉందని, అందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. గురువారం ఉట్నూర్ ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బు గుప్తతో కలిసి ఆదివాసీ గిరిజన అమరవీరుల స్థూపం వద్ద సభ స్థలంతో పాటు కేస్లాపూర్ హెలిప్యాడ్‌ను, పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. సీఎం పర్యటనకు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో పటిష్ఠ బందోబస్తు ఉండాలన్నారు. అలాగే భద్రత, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలిచ్చారు. ఎస్పీ వెంట ఉట్నూర్ ఆర్డీవో జీవాకర్‌రెడ్డి, ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, తహసీల్దార్ ప్రవీణ్, సీఐ రామకృష్ణ, ఐటీడీఏ డీడీ దిలిప్‌కుమార్, ఎస్సై దుబ్బాక సునీల్ తదితరులు ఉన్నారు.

అప్పుల బాధతో రైతు బలవన్మరణం

భీంపూర్, జనవరి 25: అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన భీంపూర్‌లో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన ఎల్మల స్వామి (38) రైతు తనకు ఉన్న నాలుగు ఎకరాల భూమిలో పత్తి పంట సాగు చేశాడు. పత్తి దిగుబడి రాకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. ఈ పంట కోసం చేసిన అప్పు, గత రెండేళ్లుగా పంట కోసం చేసిన అప్పులు సుమారు రూ.6లక్షలు కావడంతో వాటిని ఎలా తీర్చాలని తీవ్ర మనోవేధనకు గురైన ఎల్మల స్వామి బుధవారం సాయంత్రం పంట చేనులో పురుగుల మందు తాగాడు. అదే చేనులో ఉన్న కుమారుడు శివతేజ దీన్ని గమనించి వెంటనే కుమారుడు ఎడ్ల బండిపై తండ్రిని ఇంటికి తీసుకొచ్చి అనంతరం ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఎల్మల స్వామి గురువారం ఉదయం మృతిచెందాడు. మృతుడి భార్య ఎల్మల కవిత ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

మావల, జనవరి 25: పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చోటు చేసుకుంది . రూరల్ ఎస్సై ముజాహిద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వాన్వాట్ గ్రామానికి చెందిన తలాండా రాజు-అనసూయ దంపతుల కుమారుడు సీతారాం(21) బుధవారం గ్రామ శివారులో ఓ పంట చేనులో పురుగుల మందు తాగి బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గతంలో సీతారాం తల్లిదండ్రులు మృతి చెందారు. దీంతో ఒంటరిగా ఉంటూ కూలి పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఒంటరి జీవితం మీద విరక్తిచెంది పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తీసుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిర్మల్ జిల్లాలో ఘనంగా ఓటర్ల దినోత్సవం



నర్సాపూర్ (జి) మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



పెంబిలో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

నిర్మల్ జిల్లాలో ఓటర్ల దినోత్సవాన్ని గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రాలలో ర్యాలీలు నిర్వహించారు. బ్యానర్లు పట్టుకుని నినాదాలు చేశారు. పలువురు వక్తలు ఓటు ప్రాముఖ్యత గురించి వివరించారు. విద్యార్థులకు ఈ అంశంపై పలు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

నర్సాపూర్(జి), జనవరి 25 : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా కీలకమని, ప్రతి ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని మండల తహసీల్దార్ సోమ శ్రీనివాస్, హెడ్ మాస్టర్ కిషన్ రావ్ అన్నారు. గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ పాటశాల నుండి ప్రధాన వీదులగుండా విద్యార్దులచే ర్యాలీ నిర్వహించారు. అనంతరం కుస్లి కూడలి వద్ద ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, ఓటు వజ్రాయుధమని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులను ఎన్నుకునే ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సోమ శ్రీనివాస్, గిర్దావర్ సుమలత, వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ కల్యాణి, జిల్లా పరిషద్ పాటశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పెంబి : జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా మండల కేంద్రంలో గురువారం ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ లక్ష్మణ్ మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింహా, విఠల్, అంగన్‌వాడీ విశ్వరూప, సుశీల, ఏఎన్ఎం, తదితరులు ఉన్నారు.

కుభీర్ : 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు హక్కు కలిగి ఉండాలని తహసీల్దార్ సోము అన్నారు. గురువారం జాతీయ హోటు హక్కు సందర్భాన్ని పురష్కరించుకొని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఓటు హక్కుపై నినాదాలు చేస్తూ గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించి బస్టాండ్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది, విద్యార్థులు తదితరులున్నారు.

కుంటాల : ఓటు హక్కు ఎంతో విలువైందని ఓటు హక్కును దుర్వినియోగం చేయకూడదని తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎస్ఐ హన్మండ్లు అన్నారు. గురువారం మండలంలోని ఆయా గ్రామాలలో విద్యార్థులకు ప్రజలకు ఓటు హక్కు ప్రాధాన్యత గురించి వారు వివరించారు. ఓటు వజ్రాయుధం లాంటిందని దానిని సద్వినియోగపరుచుకొని ప్రతి ఒక్కరు ముందు కెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ఓటు దుర్వినియోగం చేయమని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి సోమలింగారెడ్డి, డీటీ నరేష్ గౌడ్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస ప్రసాద్‌తో పాటు పలు అధికారులు, తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద : మండలంలోని పీచర ప్రభుత్వ పాఠశాలలో ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మాదిరి ఎలక్షన్స్ నిర్వహించారు. రహస్య ఓటింగ్ పద్ధతిలో విద్యార్థుల నుంచి పాఠశాల నాయకుడిని, గేమ్స్ కన్వీనర్లను ఎన్నుకున్నారు. పోలింగ్ అధికారులుగా విద్యార్థులు వ్యవహరించారు. ఓటు హక్కు గూర్చి, ఓటు ప్రాధాన్యత గూర్చి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సాయికృష్ణ, స్థానిక సర్పంచ్ బుర్రి లతా భూమేష్‌లు పాల్గొన్నారు.



కుభీర్‌లో ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

భైంసా ఏరియా ఆసుపత్రిని సందర్శించిన

'కాయకల్ప' అధికార బృందం



వివరాలు సేకరిస్తున్న కాయకల్ప ప్రతినిధులు

భైంసా, జనవరి 25 : పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో గురవారం కాయకల్ప అధికార ప్రతినిధి బృందం సందర్శించింది. మంచిర్యాల జిల్లా లక్షెటిపేట్ ఆసుపత్రి వైద్యాధికారి డా. శ్రీకాంత్ నేతృత్వంలో అధికార ప్రతినిధి బృందం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆసుపత్రిలోని అన్ని వార్డులు , విభాగాల్లో పరిశీలనలు చేపట్టింది. రోగులకు అందుతున్న వైద్య సేవలు, వసతులు, సౌకర్యాలు తదితర వాటిని క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఆపరేషన్ థియేటర్, ఆరోగ్య శ్రీ వార్డు, జనరల్, ప్రసూతి విభాగాలను పరిశీలించి సంబంధిత విభాగాల్లో అందుతున్న వైద్య సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి శుభ్రత, పరిశుభ్రత, పడకలు, ఫ్యాన్ల స్థితిగతులు, ఆరోగ్య సిబ్బంది విధులు నిర్వహిస్తున్న తీరు, ఆసుపత్రి నిర్వహణ వ్యవస్థ తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు సేకరించారు. అనంతరం ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డా.కాశీనాథ్, వైద్య బృందంచే కాయకల్ప అధికార ప్రతినిధి బృందం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆసుపత్రి నిర్వాహణ వ్యవస్థకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఏరియా ఆసుపత్రి నిర్వాహణ తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

ముథోల్, జనవరి 25 : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు రీయంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌బీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జెవారే రాహుల్ డిమాండ్ చేశారు. ముథోల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డివిజన్ కమిటీ సమావేశంలో ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థిని విద్యార్థుల పట్ల చిన్నచూపు చూసిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఎంఈవో పోస్టులను భర్తీ చేయాలని, ఒక ఎంఈవో ఏడు మండలాలకు ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారని, ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం బిల్ విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు లెక్చరర్స్ పోస్టు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.



రైల్వే లైన్ కోసం సంతకాల సేకరణ

నిర్మల్ కల్చరల్, జనవరి 25 : నిర్మల్‌కు రైల్వే కోసం లక్ష సంతకాల సేకరణ చేయనున్నట్లు ఆదిలాబాద్ టు ఆర్మూర్ రైల్వే లైన్ సాధన సమితి చైర్మన్ ఎంసీ లింగన్న తెలిపారు. గురువారం కొత్తగా ఏర్పడ్డ సాధన సమితి నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లాకు చెందిన ఎంపీ నిరంజన్‌రెడ్డి సహా పలువురికి వినతిపత్రాలు అందజేయగా సానుకూలంగా స్పందించారన్నారు. పార్టీలకతీతంగా ప్రతినిధులను ఢిల్లీ పంపుతున్నామన్నారు. మనోజ్‌యాదవ్, విప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



దొత్తివాగు దాటుతున్న గిరిజనులు (ఫైల్)

రోడ్ల కోసం ఆదివాసీల ఎదురుచూపులు

- మారుమూల పల్లెల రోడ్లకు అటవీ అనుమతుల అడ్డు
- జిల్లాలో ఏళ్ల తరబడి తప్పని ఇబ్బందులు
- నిధులు మంజూరైనా దక్కని ఫలితం
- కిలో మీటర్ల దూరం కాలిబాటనే శరణ్యం
- వర్షాకాలంలో పరిస్థితి మరింత దయనీయం

నిర్మల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అనేక మారుమూల పల్లెల రోడ్ల నిర్మాణంపై పాలకుల నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. ఇక్కడి అనేక మారుమూల పల్లెలకు ఏళ్ల నుంచి రోడ్లు లేకపోవడంతో వారంతా కాలిబాటనే నమ్ముకుని రాకపోకలు సాగిస్తున్నారు. ముఖ్యంగా గిరిజన పల్లెలు, తండాల పరిస్థితి మరింత దయనీయంగా ఉందంటున్నారు. వర్షాకాలం సంగతి దేవుడెరుగు గానీ వేసవి, శీతాకాలంలో కూడా రోడ్డు సౌకర్యం లేక వీరు తమ ఊర్లకు చేరుకునేందుకు అష్ట కష్టాలను ఎదుర్కొంటున్నారు. రోడ్డుసౌకర్యం లేక ఈ గ్రామాలకు ఆటోరిక్షాలు కూడా నడవక పోతుండడంతో వారు ఏదైనా అవసరాల కోసం పక్క ఊరికి వెళ్లాలన్న, పట్టణ ప్రాంతాలకు వెళ్లాలన్న కాలినడకనే నమ్ముకోవాల్సి వస్తోంది. దీని కారణంగా పిల్లలు, వృద్ధులు అష్టకష్టాలు పడుతున్నారు. అయితే జిల్లాలో రోడ్ల నిర్మాణానికి పంచా యతీ రాజ్ శాఖ, ఆర్ అండ్ శాఖ, ఐటీడీఏలు రూపొందించిన ప్రతిపాదనలకు మోక్షం లభించడం లేదు. దీనికి ప్రధాన కారణం అటవీ శాఖ అనుమతులు లభించకపోవడమేనని అధికారులు చెబుతున్నారు. రోడ్ల నిర్మాణాలకు అటవీ శాఖ అనుమతులను జారీ చేయని కారణంగా సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదంటున్నారు. ఈ మారుమూల పల్లెలన్నీ రిజర్వ్‌ఫారెస్ట్ సమీప ప్రాంతాల్లో ఉండడంతో అటవీశాఖ రోడ్ల నిర్మాణానికి అనుమతులు ఇవ్వడం లేదన్న విమర్శలున్నాయి. అయితే అనుమతుల కోసం సంబంధిత పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ఐటీడీఏ అధికారులు అటవీశాఖ అధికారులకు ప్రతిపాదనలు పంపుతున్నప్పటికీ ఆ ప్రతిపాదనలకు మోక్షం లభించడం లేదంటున్నారు. ముఖ్యంగా కడెం, పెంబి, ఖానాపూర్, మామడ, సారంగాపూర్ తదితర మండలాల్లోని మారుమూల గ్రామాల రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా మారింది. ఏళ్ల నుండి రోడ్డు సౌకర్యానికి నోచుకోక తాము తిప్పలు పడుతున్నప్పటికీ ఎవరు పట్టించుకోకపోవడం పల్లె వాసుల ఆగ్రహానికి కారణమవుతోంది. అయితే పంచాయతీరాజ్ పరిధిలోను, ఆర్అండ్‌బీ, ఐటీడీఏ శాఖల ఆధ్వర్యంలో దాదాపు రూ.24 కోట్లతో రోడ్ల నిర్మాణాలకు సంబంధించిన ప్రతిపాదనలను తయారు చేశారు. అయితే ఆయా శాఖలకు నిధులు మంజూరైనప్పటికీ అటవీ అనుమతుల కారణంగా నిర్మాణ పనులు మొదలు కావడం లేదు.

పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో..

జిల్లాలోని కడెం మండలం ధర్మాజీపేట నుంచి లక్ష్మీసాగర్ వెళ్లే మారుమూల ప్రాంత రోడ్డుకు, అలాగే ఇదే మండలంలోని మరో మారుమూల గ్రామమైన మాసాయిపేట నుంచి అక్కకొండ ఆలయానికి వెళ్లే రోడ్డు అనుమతుల కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు. ఇదే మండలంలోని కొత్త మద్దిపడగ గ్రామానికి కూడా రోడ్డు మంజూరైనప్పటికీ అటవీ అనుమతులు ఇప్పటికీ లభించలేదు. దీంతోపాటు పీఎంజీఎస్‌వై కింద పెంబి మండలం రాసిమెట్ల నుంచి కొరిటికల్ వరకు దాదాపు 6 కిలోమీటర్ల మేరకు అటవీ అనుమతులు రావాల్సి ఉంది. ఇదే మండలం లోని ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి కోసగుట్ట వరకు అలాగే ఖానాపూర్ మండలం ఎర్వచింతల గ్రామం నుంచి దత్తోజిపేట్ వరకు, కడెం మండలంలోని ఆర్ అండ్ బి రోడ్డు నుంచి మారుమూల దట్టమైన గ్రామమైన అల్లంపల్లి వరకు 9 కిలోమీటర్ల మేర నిర్మించాల్సిన రోడ్డుకు ఇప్పటి వరకు అటవీశాఖ అనుమతులు జారీ చేయడం లేదు. ఐటీడీఏ పరిధిలో నిర్మిస్తున్న రోడ్లకు కూడా మోక్షం దక్కడం లేదు. కడెం మండలం పాండ్వాపూర్ గ్రామం నుంచి డ్యామ్ గూడ గ్రామానికి రోడ్డు నిర్మించేందు కోసం దాదాపు కోటీ 20 లక్షల నిధులు మంజూరయ్యాయి. దాదాపు ఒకటిన్నర కిలో మేర నిర్మించాల్సిన రోడ్డు కోసం అటవీ శాఖ అనుమతులు జారీ చేయాల్సి ఉంది. కాగా ఇదే మండలంలోని రాయదారి గ్రామం నుండి గోధుమల గ్రామం వరకు నిర్మించే రోడ్డు కోసం రెండు కోట్ల రూపాయల నిధులు మంజూరైనప్పటికీ అటవీశాఖ అనుమతులు జారీ చేయకపోవడంతో ఆ పనులు ఇప్పటికీ కూడా ప్రారంభం కాలేదు. అలాగే ఇలా పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో 20 కోట్ల రూపాయల ప్రతిపాదనలు, ఐటీడీఏ పరిధిలో మూడు కోట్ల 20 లక్షల రూపాయలతో ప్రతిపాదనను రూపొందించిన అధికారులు అటవీ అనుమతులు రాకపోవడంతో ఆ ప్రతిపాదనలన్నీ కాగితాలకే పరిమితమవుతున్నాయంటున్నారు.

వానాకాలంలో మరింత దయనీయం

మారుమూల పల్లెలకు కనీసస్థాయిలో రోడ్డుసౌకర్యం లేని కారణంగా అక్కడి పల్లెప్రజలు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. వారు వర్షాకాలం పూర్తయ్యే వరకు తమ తండాలు గూడాలకు మాత్రమే పరిమితం కావలసి వస్తుందంటున్నారు. బాహ్య ప్రపంచానికి దూరంగా ఉంటూ క్షణమొక యుగంగా గడుపుతుంటారు. వర్షాకాలంలో రోడ్డు సౌకర్యం లేక రాకపోకలు జరగవన్న ఉద్దేశంతో వారంతా వర్షాకాలం కన్నా ముందుగానే వంట సామాగ్రి ఇతర సామాన్లు ముందుగానే తీసుకొని నిలువ చేసుకుంటారు.

రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నాం..

మాసాయిపేట నుంచి అక్కకొండ గ్రామం వరకు రోడ్డుసౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నాం. ఈ రోడ్డు నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలను రూపొందించారని సమాచారం. అయితే అటవీ శాఖ అనుమతి నివ్వక పోవడంతో రోడ్డు నిర్మాణం చేపట్టలేక పోతున్నామని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా తమ గ్రామానికి రోడ్డు నిర్మించి ఏళ్ల నుంచి ఉన్న సమస్యను పరిష్కరించాలి. అక్కకొండ ఆలయానికి వచ్చే భక్తులు సైతం రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నారు.

- మందపల్లి రమేష్, ఎలగడప గ్రామస్థుడు



వాగు దాటుతున్న గిరిజనులు (ఫైల్)

రోడ్డుపై నడవలేకపోతున్నాం..

గ్రామానికి మంజూరైన రోడ్డు నిర్మాణం ఇప్పటి వరకు మొదలు కాలేదు. ఈ రోడ్డుపై నడవలేక అవస్థలు పడుతున్నాం. ఏళ్ల నుంచి తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నప్పటికీ అరణ్య రోదనగానే మారింది. వర్షాకాలంలో మా ఊరు నుంచి ఇంకో ఊరికి పోలేని పరిస్థితి ఉంటుంది. ఇప్పటికైనా అటవీశాఖ ద్వారా అనుమతులు సాధించి రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాలి.

- దుర్లే వెంకటేష్,
కొత్త మద్దిపడగ,
కడెం మండలం

ప్రారంభమైన అఖండ హరినామ సప్తాహం



అఖండ హరినామ సప్తాహం ప్రారంభించి పూజలు చేస్తున్న దృశ్యం

ముథోల్, జనవరి 25 : మండలంలోని చించాల గ్రామంలో గురువారం స్థానిక హనుమాన్ ఆలయంలో అఖండ హరినామ సప్తాహం ప్రారంభమైంది. ఈ సప్తాహం గురువారం నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు శ్రీ నారాయణ మహారాజ్ యాతల్‌కర్ నేతృత్వంలో అంగరంగ వైభవంగా జరుగనుంది. ఏడు రోజులు ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు అన్నదాన కార్యక్రమం చేపడతారు. రాత్రి వేళలో ఆయా ప్రాంతాల నుండే కాకుండా మహారాష్ట్ర నుంచి సైతం భజన బృందాలు పాల్గొని భజన చేస్తారు.

సీఎం ప్రధాన సలహాదారును కలిసిన డీసీసీ అధ్యక్షుడు



నిర్మల్ కల్చరల్, జనవరి 25 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధాన సలహాదారుడిగా నియమితులైన వేంనరేందర్ రెడ్డిని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావు హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఓబీసీ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని కలిసి అభినందించారు.

జిల్లాలో కొనసాగుతున్న ఆపరేషన్ స్మైల్



ఇటుక బట్టీలలో ఉంటున్న పిల్లలకు మెటీరియల్ అందిస్తున్న దృశ్యం

నిర్మల్ రూరల్, జనవరి 25 : మండలంలోని నీలాయిపేట్ గ్రామంలో ఇటుక బట్టీలలో ఇటుకల తయారీ కోసం ఆదిలాబాద్ నుంచి వలన వచ్చినటువంటి కుటుంబాలకు, వారి పిల్లలకు సెంటర్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో గురువారం జిల్లా బాలల సంరక్షణ విభాగం, జిల్లా పోలీసు వారి ఆధ్వర్యంలో ఇటుక బట్టీలలో ఉంటున్న పిల్లలకు వర్క్ సైడ్ స్కూల్ ఆ పిల్లలకు పలకలను, బుక్స్, పెన్సిల్స్, పెన్నులు, బెడ్ షీట్లు, బట్టలు ఇవ్వడం జరిగింది. ఆరు సంవత్సరాల లోపల పిల్లలకు ఐసీడీఎస్ పోషకాహారాన్ని, గుడ్లు, పాలు, పప్పు, బియ్యం అందించడం జరిగింది. నిర్మల్ గ్రామీణ ఎస్సై అశోక్ మాట్లాడుతూ... సీఆర్‌డీ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి దేవి మురళి, సీఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ మేనేజర్ ఏ శ్రీనివాస్, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ నల్ల గంగాధర్, శైలజ కౌన్సిలర్, ఎస్సై అశోక్, హెడ్ కానిస్టేబుల్ షౌకత్ అలీ, హెడ్ కానిస్టేబుల్ చిన్నయ్య, నరేష్, వజ్రమ్మ, తదితరులు ఉన్నారు.

ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొననున్న

సిర్గాపూర్ గ్రామ సంఘం అధ్యక్షురాలు

దిలావర్‌పూర్, జనవరి 25 : మండలంలోని సిర్గాపూర్ గ్రామ ఐకేపీ స్వయం సహాయక సంఘం గ్రామ అధ్యక్షురాలు ఇప్ప దయశీలకు జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. దయశీల 2004లో సిర్గాపూర్ గ్రామంలో స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా చేరింది. పొదుపులు ప్రతీనెలా జమచేస్తూ స్వయం ఉపాధి కోసం గ్రామ సంఘంలో అప్పులు తీసుకుంది. తీసుకున్న అప్పులను సక్రమంగా చెల్లిస్తూ ఆర్థికస్థితిని మెరుగుపరుచుకుంది. తద్వారా బ్యాంకు రుణంతో పాటు, స్త్రీనిధి నుంచి రుణం తీసుకుని తన భర్త గంగన్నకు మోటార్ వైండింగ్, రిపేరింగ్ షాప్‌ను సిర్గాపూర్‌లో పెట్టించింది. తద్వారా క్రమంగా ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. వారి పిల్లలను ఉన్నత చదువులు చదివించారు. ఆహ్వానం అందుకున్న దయశీల వెంటనే ఢిల్లీ బయలుదేరి వెళ్లింది. అక్కడ దయశీల సన్మానంతో పాటు ప్రశంసా పత్రం, అవార్డును పొందనున్నారు.

ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల్లో పాల్గొనే అవకాశం రావడం సంతోషంగా ఉంది. జాతీయస్థాయిలో అవార్డు పొందడం గర్వంగా అనిపిస్తుంది.

ఓటరు నమోదుకు పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్



జాతీయ ఓటరు దినోత్సవంలో కలెక్టర్, అదనపు కలెక్టర్లు

నిర్మల్ కల్చరల్, జనవరి 25 : జిల్లాలో ఓటు నమోదుకు అనేక రకాలుగా ఏర్పాట్లు చేశామని, ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని గురువారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... ఓటు పొందిన ప్రతీ ఒక్కరూ దానిని వినియోగించుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు కీలకమని తెలిపారు. ఎలాంటి ప్రలోభాలకు లోనవకుండా నిష్పాక్షికంగా వ్యవహరించాలని సూచించారు. ఓటు నమోదు దాని ఆవశ్యకత గూర్చి అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఓటు నమోదు చేసుకున్న పలువురు దివ్యాంగులను, సీనియర్ సిటిజన్లు, యూత్, ట్రాన్స్‌జెండర్లను శాలువాతో సన్మానించారు. ఓటరు దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. పాఠశాల విద్యార్థిని విద్యార్థులు ఓటు నమోదు, వినియోగంపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. అదనపు కలెక్టర్లు కిశోర్‌కుమార్, ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్న కళ్యాణి, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

జాతీయ ఓటర్ల దినోత్సవ ర్యాలీ

జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం నిర్మల్‌లో ర్యాలీ నిర్వహించారు. మంచిర్యాల చౌరస్తాలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఓటు ప్రాధాన్యత ప్రజలకు వివరించారు. ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఎన్టీఆర్ స్టేడియం వరకు కొనసాగిన ర్యాలీలో అదనపు కలెక్టర్లు కిషోర్‌కుమార్, ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్న కళ్యాణి, డీపీఆర్వో తిరుమల, అధికారులు, పలు పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా అధికారులు

నిర్మల్‌లోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో శుక్రవారం నిర్వహించే గణతంత్ర వేడుకల ఏర్పాట్లను కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ పరిశీలించారు. వేదిక, విజిటర్స్ గాలరీ తదితర వాటిని ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, తదితర అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

'నవజాత శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేకదృష్టి సారించాలి'

భైంసా, జనవరి 25: తల్లితండ్రుల తమ తమ నవజాత శిశువుల ఆరోగ్య పరిరక్షణ కోసం గాను ప్రత్యేక దృష్టి సారించాలని హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ వైద్యులు డా. పద్మజ కుమారి, డా. ఐశ్వర్యలు సూచించారు. గురువారం భైంసా ఏరియా ఆసుపత్రిలో ఆర్‌వోపీ స్క్రీనింగ్ సెంటర్ ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రెండు కిలోల కంటే తక్కువ బరువుతో పాటు తక్కువ నెలలతో జన్మించిన శిశువులకు కంటి చూపు మందగించే పరిస్థితులు ఉంటాయని తెలిపారు. ఇలాంటి శిశువులకు ఆరోగ్య పరీక్షలతో పాటు కంటి పరీక్షలను నిర్వహించి అవసరమైన వైద్య చికిత్సలు అందిస్తే భవిష్యత్తులో ఎలాంటి ఆరోగ్యపరమైన సమస్యలు రాకుండా ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు. సంబంధిత శిశువులకు చికిత్సలు అందించేందుకు గాను భైంసా ఏరియా ఆసుపత్రిలో ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఆర్‌వోపీ స్కీనింగ్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుక వచ్చినట్లుగా వివరించారు. శిశువులకు ఈ సెంటర్ ద్వారా మెరుగైన సేవలు అందిస్తామని వివరంచారు. ఇందులో ఏరియా ఆసుపత్రి సూపరింటెంట్ డా.కాశీనాథ్, చిన్న పిల్లల వైద్య నిపుణులు డా. అనిల్ కుమార్ జాదవ్, డా.విజయానంద్ జాదవ్, ముథోల్ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి మేనేజర్ సందీప్ రావ్, కమ్యూనీటి ఐ కేర్ కోఆర్డినేటర్ సాయన్నతో పాటు పలువురు పాల్గొన్నారు.



నవజాత శిశువును ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే రాంరావుపాటిల్

కుభీర్, జనవరి 25 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని ముధోల్ ఎమ్మెల్యే రాంరావు పాటిల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఏఎంసీ కార్యాలయంలో మార్క్‌ఫెడ్ సౌజన్యంతో సహకార సంఘం ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు దిగుబడులను కొనుగోలు కేంద్రంలో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. సంబంధిత ఏఎంసీ కార్యాలయ కార్యదర్శి సిబ్బంది మాట్లాడుతూ మండలంలో దళారులు వ్యవసాయ దిగుబడులను కొనుగోలు చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సరస్వతీ మాత నూతన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పీఏసీఎస్ చైర్మన్, మార్క్‌ఫెడ్ స్టేట్‌డైరెక్టర్ గంగాచరణ్, వైస్‌ఎంపీపీ మోహియోద్దిన్, తహసీల్దార్ సోము, నాయకులు సాప్లీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాంరావుపాటిల్

'హోమియో క్లినిక్'ను ప్రారంభించిన ఎమ్మెల్యే



క్లినిక్‌ను ప్రారంభిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్ కల్చరల్, జనవరి 25 : జిల్లాకేంద్రంలో వసుధర ఇంటీరియల్ అండ్ కన్స్ట్రక్షన్ 'హోమియోక్లినిక్'ను గురువారం ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, మాజీ ఎమ్మెల్యే ఎన్. ఇంద్రకరణ్‌రెడ్డి, అయ్యన్నగారి రాజేందర్, ఫణిందర్‌రావు, న్యాయవాదులు సుదర్శన్, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.